జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
09 బుధవారం, సెప్టెంబర్ 2026 పేజీలు:15



02లో

## స్త్రీనిధి రుణాలతో మహిళలకు ఆర్థిక భరోసా

- ఎలక్ట్రిక్ ఆటోలతో ఉపాధి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

# అంగన్వాడీల్లో నిర్లక్ష్యానికి చెక్!



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల హాజరు, కొత్త పిల్లల నమోదు, గర్భిణులు, బాలింతల వివరాలు, ఫేస్ రికగ్నిషన్ నమోదు, టేక్ హోమ్ రేషన్ , బాలామృతం పంపిణీ, పిల్లల బరువు, ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, భవనాలు, వంటగది తదితర మౌలిక వసతుల పరిస్థితిని కూడా కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న సేవల్లో నాణ్యత లోపించకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

మిగతా 2 లో

మొదటిపేజీ తరువాయి

# స్త్రీనిధి రుణాలతో మహిళలకు ఆర్థిక భరోసా

## - ఎలక్ట్రిక్ ఆటోలతో ఉపాధి పర్యావరణ పరిరక్షణకు

## తోడ్పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08:**

మహిళా స్వయం సహాయక సంఘాలు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.సెర్ప్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన రూ.3 లక్షల స్త్రీనిధి రుణాలతో కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ ఆటోలను మంగళవారం ఐడీఓసీ ప్రాంగణంలో కలెక్టర్ ప్రారంభించారు.రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా మహిళలకు మంచి ఆదాయం లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు.అనంతరం కలెక్టర్ స్వయంగా ఆటోలో ప్రయాణించి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ముషాహిదా బేగం, డీపీఎం సలోమి,స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సందీప్,ఏపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుడు పల్లె రవి కుటుంబానికి ఏపీ మిథున్‌రెడ్డి పరామర్శ

## - రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పల్లె రవి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పల్లె రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పల్లె రవి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రవి మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమంలో పల్లె రవి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



# అంగన్వాడీల్లో నిర్లక్ష్యానికి చెక్!

## - సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ.. ప్రాక్సీ, నకిలీ సిబ్బంది ఉంటే కఠిన చర్యలు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల హాజరు, కొత్త పిల్లల నమోదు, గర్భిణులు, బాలింతల వివరాలు, ఫేస్ రికగ్నిషన్ నమోదు, టేక్ హోమ్ రేషన్ , బాలామృతం పంపిణీ, పిల్లల బరువు, ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, భవనాలు, వంటగది తదితర మౌలిక వసతుల పరిస్థితిని కూడా కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న సేవల్లో నాణ్యత లోపించకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

### రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పర్యటనలు:

అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీఓల క్షేత్రస్థాయి పర్యటనలపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రతి సూపర్‌వైజర్ తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి, అక్కడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. కేవలం రికార్డులు, నివేదికల పరిశీలనకే పరిమితం కాకుండా పిల్లలు, గర్భిణులు, బాలింతలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీయాలని స్పష్టం చేశారు.

### ప్రాక్సీ సిబ్బంది ఉంటే కఠిన చర్యలు:

అంగన్వాడీ కేంద్రాల్లో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రాక్సీ సిబ్బంది లేదా నకిలీ సిబ్బంది



పనిచేస్తున్నట్లు తేలినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కేంద్రాల నిర్వహణ, సిబ్బంది హాజరు, లబ్ధిదారులకు అందుతున్న సేవల విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డీడబ్ల్యూఓ జరీనా బేగం, సీడీపీఓలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## - ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి





**గద్వాల సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

పభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని,విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించి వారి విద్యాభ్యాసం,ఏకరూప దుస్తులు,రాత,పాఠ్యపుస్తకాలపై ఆరా తీశారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని,రాగి జావ లేదా పాలు తప్పనిసరిగా అందజేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.పాఠశాలలో తగినన్ని తరగతి గదులు ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆరా తీశారు.ప్రతిరోజూ విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పలువురు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా తెలుసుకున్న కలెక్టర్ వారిని అభినందించారు.విద్యార్థులు క్రమశిక్షణతో,చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదిగి తమ తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.

# ఈనాడు ప్రతిభా పోటీల్లో విశిష్ట నోబుల్ విద్యార్థుల హ్యాట్రిక్!

## వ్యాసరచన పోటీలో మూడు బహుమతులు కైవసం

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08:**




మంగళవారం రోజు ఈనాడు యాజమాన్యం నిర్వహించిన ఈనాడు ప్రతిభా పాటవ పోటీల్లో విశిష్ట నోబుల్ సీబీఎస్ఈ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.సమాజంపై ఎల్‌నినో ప్రభావం"అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాఠశాల విద్యార్థులు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించి ప్రతిభను చాటారు.10వ తరగతి విద్యార్థిని బి.ఐశ్వర్య ప్రథమ బహుమతి,9వ తరగతి విద్యార్థిని ఎన్. శృతి ద్వితీయ బహుమతి,9వ తరగతి విద్యార్థిని జె.యుక్తశ్రీ తృతీయ బహుమతి సాధించారు.ఒకే పోటీలో మూడు బహుమతులను కైవసం చేసుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విజేతలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి,ప్రిన్సిపాల్ విజయలక్ష్మి,శ్యామల, ఏఓ జయ,సుజాతతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రతిభా పాటవ పోటీల్లోనూ రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




# జడ్చర్ల మున్సిపాలిటీలో సేవలు మరింత మెరుగుపడాలి

## - పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి..

## తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి : అదనపు కలెక్టర్

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో పౌరులకు అందుతున్న మౌలిక వసతులు, మున్సిపల్ సేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) సమగ్ర సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో ప్రధానంగా ఆస్తి పన్నుల వసూళ్లు, భవన నిర్మాణ అనుమతులు, ఇంజనీరింగ్ పనులు, పారిశుధ్య నిర్వహణ, ట్రేడ్ లైసెన్సులు, ప్లాంటేషన్, లైవ్ ఆథెంటికేషన్, ఇందిరమ్మ ఇళ్లు, షాప్ రెంట్లు, పారిశుధ్య కార్మికుల హాజరు, ట్యాప్ కలెక్షన్స్ యాక్షన్ ప్లాన్, ప్రజావాణి ఫిర్యాదులు తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజూ ఇంటింటికీ తాగునీటి సరఫరా జరుగుతున్న తీరును కూడా అదనపు కలెక్టర్ సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పన్నుల వసూళ్లలో వేగం పెంచడంతో పాటు, ప్రజలకు అందుతున్న మౌలిక వసతులు, పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజల నుంచి అందుతున్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలు, మున్సిపల్ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, పారిశుధ్యం, పౌర సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆయన ఆదేశించారు.



# మెదడు ఆపరేషన్‌కు రోబో చేయూత..

# యశోదలో అధునాతన న్యూరోసర్జరీ

- మెదడు శస్త్రచికిత్సల్లో 'రోసా' రోబోట్ విప్లవం!
- జీపీఎస్‌లా మార్గనిర్దేశం చేస్తూ.. అత్యంత కచ్చితత్వంతో సంక్లిష్ట న్యూరోసర్జరీకి కొత్త భరోసా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8**

**( ప్రజా జ్యోతి బ్యూరో ):**

సంక్లిష్టమైన మెదడు కణితుల శస్త్రచికిత్సలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని, రోబోటిక్ న్యూరోసర్జరీ ద్వారా మరింత ఖచ్చితత్వంతో చికిత్స అందించే అవకాశాలు పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్స్ న్యూరో సర్జన్ డా. అయ్యాదురై తెలిపారు. సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న 'రోసా' బ్రెయిన్ రోబోట్ న్యూరోసర్జన్‌కు శస్త్రచికిత్స సమయంలో జీపీఎస్ తరహాలో మార్గనిర్దేశం చేస్తుందని వివరించారు. శస్త్రచికిత్స ప్రక్రియలో నిరంతర ఫీడ్‌బ్యాక్ అందించడం ద్వారా మెదడులోని లోతైన ప్రాంతాల్లో ఉన్న కణితులను కూడా అత్యంత కచ్చితత్వంతో చేరేందుకు ఈ సాంకేతికత సహకరిస్తుందని తెలిపారు.

**కీ-హోల్ సర్జరీకి మరింత ఖచ్చితత్వం:**

మెదడులోని సంక్లిష్ట ప్రాంతాల్లో ఉన్న కణితులకు చికిత్స అందించే సమయంలో మిల్లీమీటర్ స్థాయి ఖచ్చితత్వం ఎంతో కీలకమని వైద్య నిపుణులు పేర్కొన్నారు. రోబోటిక్ సహకారంతో కీ-హోల్ విధానంలో శస్త్రచికిత్స నిర్వహించేందుకు వీలవుతుందని, తద్వారా సంక్లిష్ట బ్రెయిన్ ట్యూమర్ల చికిత్సలో భద్రత, ఖచ్చితత్వాన్ని మరింత మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఇంట్రా -ఆపరేటివ్ ఏం ఆర్ ఐ, ఇంట్రా -ఆపరేటివ్ మానిటరింగ్, న్యూరోనావిగేషన్, హైఎండ్ మైక్రోస్కోప్, ఎండోస్కోప్ వంటి ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు న్యూరోసర్జన్ అనుభవం కలిసినప్పుడే మెరుగైన చికిత్సా ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.

**న్యూరో ఎండోస్కోపీలో ప్రత్యేక కేంద్రం:**

యశోద సెంటర్ ఫర్ న్యూరో ఎండోస్కోపీ ద్వారా ముక్కు మార్గం లేదా కీ-హోల్ విధానంలో చికిత్స చేయగల మెదడు, స్కల్ బేస్ సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పిట్యూటరీ అడినోమా, క్రానియోఫారింజియోమా, స్కల్ బేస్ మెనింగియోమా, క్రానియోఫారింజియోమా వంటి కణితులతో పాటు సిఎస్ఎఫ్ రైనోరియా, స్కల్ బేస్ రిపేర్, స్కల్ బేస్ ఆస్టియోమైలైటిస్ తదితర సమస్యలకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. అలాగే ట్రైజెమినల్ న్యూరాల్జియా, హెమీ ఫేషియల్ స్పాసమ్ వంటి సమస్యలకు నిర్వహించే ఎండోస్కోపిక్ మైక్రోవాస్కులర్ డీకంప్రెషన్ కూడా న్యూరో ఎండోస్కోపీ విభాగంలో ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో మంగళ వారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హాస్పిటల్ ప్రతినిధులు న్యూరో సర్జన్ డా. అయ్యాదురై, మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ పాల్గొని ఆధునిక న్యూరోసర్జరీలో అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, రోబోటిక్ శస్త్రచికిత్సల ప్రత్యేకతలను వివరించారు. సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సల్లో ఆధునిక సాంకేతికతను వైద్య నిపుణుల అనుభవంతో సమన్వయం చేయడం ద్వారా రోగులకు మరింత సురక్షితమైన, ఖచ్చితమైన చికిత్స అందించే దిశగా యశోద హాస్పిటల్స్ కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు.




# అలింకో అసెస్‌మెంట్ క్యాంప్‌కు విశేష స్పందన

## - రెండో రోజు 90 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అసెస్‌మెంట్..

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 8( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన సహాయక పరికరాలు, తోడ్పాటు సేవలు అందించేందుకు మహబూబ్‌నగర్ అర్బన్ భవిత సెంటర్‌లో నిర్వహిస్తున్న అలీమ్కో అసెస్‌మెంట్ క్యాంప్ రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. రెండో రోజు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 90 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులు హాజరై అవసరమైన అసెస్‌మెంట్‌లను పూర్తి చేశారు. అలీమ్కో అసెస్‌మెంట్ బృందం విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను పరిశీలించి, వారికి అవసరమైన సహాయక పరికరాలు, ఇతర తోడ్పాటు సేవలను గుర్తించే ప్రక్రియను చేపట్టింది. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం, అలీమ్కో సంస్థల ద్వారా అందే సంక్షేమ ప్రయోజనాలను చేరువ చేయడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. క్యాంప్‌ను సీఎంఓ సుధాకర్‌రెడ్డి సందర్శించి ఏర్పాట్లు, అసెస్‌మెంట్ ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఈ ఆర్ పి లు చురుకుగా పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవసరమైన సహకారం అందించారు.

**బుధవారం చివరి అవకాశం :**

అలీమ్కో అసెస్‌మెంట్ క్యాంప్‌కు బుధ వారం చివరి రోజు కావడంతో జిల్లాలోని అర్హులైన ప్రత్యేక అవసరాల విద్యార్థులు






తప్పనిసరిగా క్యాంప్‌కు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి సూచించారు. ఒక్క అర్హుడైన విద్యార్థి కూడా ఈ అవకాశాన్ని కోల్పోకుండా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించి క్యాంప్‌కు తీసుకురావాలని ఆమె కోరారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయు లక్ష్యం

## - ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి







**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 8( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ టీఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, సమస్యలు పరిష్కరించే వరకు ఉపాధ్యాయ సమరం ఆగదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. మంగళవారం కల్వకుర్తిలోని కేబీఎన్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై. ముందుగాపీఆర్టీయూ టీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా దొడ్ల సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల సురేందర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సూర్య శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి పక్షాన నిలబడి, వాటి పరిష్కారం కోసం అన్ని విధాలుగా కృషి చేసే సంఘం పీఆర్టీయూ టీఎస్ అని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పరిష్కారం లభించే వరకు ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఇటీవల సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులతో నిర్వహించిన మహాధర్నాను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహాధర్నా ద్వారా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వానికి బలమైన సందేశం వెళ్లిందని తెలిపారు. దీంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఆలోచించే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీ, డీఏపై పోరాటం సీపీఎస్ రద్దు, పీఆర్సీ, డీఏ, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు, ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ వంటి అనేక సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం పోరాడుతోందని ఎమ్మెల్సీ తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనలో పీఆర్టీయూ చేపట్టిన ఉద్యమాలు ప్రభావంచూపుతున్నాయని పేర్కొన్నారు. డిసెంబర్ 10న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలునూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, ఎడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారులు రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, బల్మూరు రామచంద్రరావు, బిచ్చ నాయక్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంపై కబ్జా ఆరోపణలు

## పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తుల

## ఫిర్యాదు చర్యలు తీసుకోవాలని డిమాండ్



**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08:**

జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి  మండలం బొంకూరు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఆరోపిస్తూ గ్రామస్తులు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,గతంలో ప్రభుత్వం గ్రామంలో పేదలకు ప్లాట్లుకేటాయించిందని, అందులో ఓ వ్యక్తికి కేటాయించిన ప్లాట్‌ను మరొకరికి విక్రయించిన  మిగిలిన ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు.ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించిన వ్యక్తిపై విచారణ జరిపి, వెంటనే చర్యలు తీసుకోవాలని వారు పంచాయతీ కార్యదర్శిని కోరారు. ప్రభుత్వ స్థలాలను కాపాడి,అర్హులైన వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ చావును కోరడం రాజకీయ సంస్కృతికి విరుద్ధం!

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం
- హామీలు అమలు చేయాలి.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్
- హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం.. ప్రజా సమస్యలు పక్కనపెట్టి ప్రతిపక్షంపై కక్ష సాధింపు: బీఆర్ఎస్ నేతల ధ్వజం

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరణాన్ని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తీవ్రంగా స్పందించారు. రాజకీయాల్లో విభేదాలు సహజమేనని, అయితే ప్రత్యర్థి మరణాన్ని కోరుకునే స్థాయికి రాజకీయాలు దిగజారకూడదని ఆయన అన్నారు. భగవంతుడే ఎవరి జీవితానికి ముగింపు ఎప్పుడు అనేది నిర్ణయిస్తారని, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. “తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర లేకపోతే రాష్ట్రం వచ్చేదా?” అని ప్రశ్నించారు. ప్రజలకు నీళ్లు అందించినందుకా, సంక్షేమ పథకాలు అమలు చేసినందుకా కేసీఆర్ చావాలని కోరుకోవాలంటూ ఆయన మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని తాము ఎప్పుడూ కోరుకోలేదని, ప్రభుత్వం మంచి పనులు చేయాలని మాత్రమే కోరుకుంటున్నామని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. రానున్న బడ్జెట్‌లోనైనా పెండింగ్‌లో ఉన్న పథకాలను అమలు చేసి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీల అమలు కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తుంటే పోలీసులను ఉపయోగించి వారి గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఓ శాసనసభ్యుడు చేసిన వ్యాఖ్యలను శ్రీనివాస్‌గౌడ్ తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత దూషణలు, మరణాన్ని కోరుకునే వ్యాఖ్యలు రాజకీయాల్లో దిగజారుడు సంస్కృతికి నిదర్శనమన్నారు. తెలంగాణ సాధన, రైతుబంధు, సాగునీటి ప్రాజెక్టులు, పెన్షన్ల పెంపు, వికలాంగుల సంక్షేమం, మిషన్ భగీరథ, జిల్లాల వారీగా వైద్య సదుపాయాల విస్తరణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేసీఆర్ పాలనపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు.“చావును నిర్ణయించేది భగవంతుడు మాత్రమే. రాజకీయ విభేదాలు ఉన్నా ఇలాంటి వ్యాఖ్యలకు తావివ్వకూడదు” అని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్పందించాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే మాట్లాడించిందనే భావన ప్రజల్లో ఏర్పడుతుందని హెచ్చరించారు.

### ‘1000 రోజుల పాలనపై ప్రజలకు సమాధానం చెప్పాలి’

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల సందర్భంగా మాజీ మంత్రి, బిఆరెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 420 హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు నిరసన కార్యక్రమాలకు హాజరవుతున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవద్దని, సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.“ఇన్ని రోజులు పాలన సాగినా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. చేతగాని పాలనతో రాష్ట్రం వెనక్కి వెళ్తోంది” అని లక్ష్మారెడ్డి విమర్శించారు.కేసీఆర్ మరణాన్ని కోరుతూ కొందరు కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర అభ్యంతరకరమని ఆయన అన్నారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.

### ‘పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై దృష్టి పెట్టాలి’

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వ కార్యక్రమాలు, ఢిల్లీ పర్యటనలు కాకుండా.. ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. వారం రోజుల పాటు బీఆర్ఎస్ నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశం అనంతరం బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ‘కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా?’

దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం, మరణాన్ని కోరుకోవడం రాజకీయంగా సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలు, డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులపై ఆయన విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, పాలనపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.మొత్తంగా, నారాయణపేట మాజీ ఎమ్మెల్యే










రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌పై మరణాన్ని కోరుకునే విధంగా వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, భూత్పూర్ మాజీ వైస్ చైర్మన్ బస్వరాజ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మహబూబ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాలరాజు, గిరిధర్‌రెడ్డి, జంబులయ్య, కట్ట రవికిషన్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి

## - ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## - మహబూబ్‌నగర్‌లో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ అవగాహన ర్యాలీ

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**




అక్షరాస్యతే వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి పునాది అని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అందిపుచ్చుకొని తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎన్ ఐ ఎల్ పి – ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాస్యత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మల్లికార్జున్ ఎంటర్‌ప్రైజెస్ మీదుగా సాగి అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని "ప్రతి ఒక్కరూ చదవాలిప్రతి ఒక్కరూ ఎదగాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, అది వ్యక్తిలో అవగాహన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సాధికారతకు దోహదం చేస్తుందని తెలిపారు. అక్షరాస్యత పెరిగిన కొద్దీ ఉపాధి అవకాశాలు, కుటుంబాల అభివృద్ధి, సామాజిక చైతన్యం పెరుగుతాయని పేర్కొన్నారు. "అక్షరం ప్రతి ఒక్కరి హక్కు.. విద్య ప్రతి కుటుంబానికి బలం. నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత" అని కలెక్టర్ అన్నారు.




### నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించాలి:

వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించడం, విద్య ప్రాముఖ్యతను ప్రతి ఇంటికీ చేరవేయడం లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, డీఈఓ విజయకుమారి, డీఆర్‌డీఓ నర్సింహులు, వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## - విద్యాబోధన, భోజనం, వసతులపై విద్యార్థులతో నేరుగా ఆరా

## - హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై బాలికలకు అవగాహన కల్పించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

హన్వాడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజనం, వసతులను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ 7వ, 10వ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో విద్యాబోధన ఎలా సాగుతోంది, ఉపాధ్యాయులు పాఠాలను సక్రమంగా బోధిస్తున్నారా, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా అనే విషయంపై కూడా విద్యార్థులను ఆరా తీశారు.

### పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి:

అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించిన కలెక్టర్.. కిచెన్‌లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం, సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాలలోని మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక వసతులను కూడా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి:

కేజీబీవీలో నాబార్డు నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

### హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన:

అనంతరం పాఠశాలలో నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల



బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థినులందరూ వ్యాక్సిన్ తీసుకునేలా తగిన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల విద్యతో పాటు వారి ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి (ఎస్ఓ) అన్నపూర్ణ, వైద్య అధికారి ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

# "ఓటరు హక్కుకు భంగం కలగొద్దు.. ఎస్ఐఆర్‌లో పారదర్శకతే కీలకం!"

- ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు
- నిబంధనల మేరకు పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మంగళవారం హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులు ఉంటే వాటిని ఏ విధంగా సరిచేస్తున్నారు, ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసుల్లో సవరణలు పూర్తయ్యాయి వంటి అంశాలపై అధికారులను కలెక్టర్ ఆరా తీశారు.

**అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు:**

ఓటర్ల జాబితాలో ఇంటిపేరు, ఓటరు పేరు, ఫొటో తదితర వివరాల్లో తేడాలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం సరిచేయాలని కలెక్టర్ సూచించారు. ఫొటోల్లో తప్పులు ఉంటే సవరించడంతో పాటు, పేరు లేదా ఇంటిపేరులో మార్పులు అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే సవరణలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేసిన నోటీసులపైనా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు నిర్ణీత విధానంలో విచారణ నిర్వహిస్తున్నారా, ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు, ప్రజల స్పందన ఎలా ఉంది తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**హియరింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి:**

విచారణకు ఓటర్లు హాజరవుతున్న తీరు, ప్రజల నుంచి వస్తున్న స్పందనపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరవుతున్నారని, ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి దశలో నిబంధనలు పాటిస్తూ పారదర్శకతకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హన్వాడ తహసీల్దార్ కిష్ట్యా నాయక్, ఆర్‌డీఓ నవీన్, తదితర అధికారులు పాల్గొన్నారు.



# పదవ బెటాలియన్ కి కొత్త అడిషనల్ కమాండెంట్

- బాధ్యతలు చేపట్టిన బి. ఆదినారాయణ కలెక్టర్, ఎస్పీతో భేటీ

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08 :**

10వ బెటాలియన్ టీజీ ఎస్పీ  అడిషనల్ కమాండెంట్‌గా బి. ఆదినారాయణ బాధ్యతల స్వీకరణ 10వ బెటాలియన్ బీచుపల్లి నందు కొత్తగా అడిషనల్ కమాండెంట్‌గా ఆదివారం రోజు బాధ్యతలు స్వీకరించిన బి.ఆదినారాయణ  మంగళవారం గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ తో భేటీ అయిన అనంతరం బెటాలియన్ సిబ్బంది విధులు,డ్యూటీల నిర్వహణ,శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది పాత్ర తదితర అంశాలపై చర్చించారు. బెటాలియన్ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా చర్చించడం జరిగింది. ఇదిలా ఉండగా,10వ బెటాలియన్ లో అడిషనల్ కమాండెంట్‌గా విధులు నిర్వహించిన ఎం. జయరాజు 8వ బెటాలియన్ కు బదిలీ కావడంతో,ఆయన స్థానంలో బి. ఆదినారాయణ కొత్తగా అడిషనల్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.





# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన టీచర్ అగస్టిన్

- టీచర్ ఆగస్టీన్ నీ అభినందించిన డాక్టర్ ప్రేమ్ కుమార్

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08:**

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ పొందిన తప్పెట్ల మోర్స్ హై స్కూల్ టీచర్ అగస్టిన్ ఆదర్శప్రాయుడు అని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు.పేద విద్యార్థులకు జ్ఞానం అందిస్తూ విద్యా వ్యవస్థలో ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని.అంతే కాక కొద్ది మంది టీచర్ లు మాత్రమే ఎంపిక అయ్యే ఫిన్లాండ్ పర్యటనకు టీచర్ అగస్టిన్ ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయం అని.పేద,మధ్య తరగతి విద్యార్థులకు జ్ఞానం అందిస్తూ తన సేవలు పరిపూర్ణంగా సఫలీకృతం చేసుకుంటూ వెళ్తున్న టీచర్ అగస్టిన్ ఆదర్శప్రాయుడు అని కొనియాడారు.ఉత్తమ ఉపాధ్యాయుడి గా ఎన్నికైన సందర్భంగా సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ టీచర్ అగస్టిన్ ను ఘనంగా సన్మానించారు.



# చెత్త ఎత్తిన అదనపు కలెక్టర్.. పరిశుభ్రతపై సందేశం!

## - మోడ్రన్ స్కూల్‌లో స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

: పరిశుభ్రత అనేది కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని చాటిచెప్పేలా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వ్యవహరించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని మోడ్రన్ స్కూల్‌లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని చెత్తను తొలగించారు.పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చురుగ్గా పాల్గొన్నారు. స్వయంగా చెత్తను ఎత్తడంతో పాటు, పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించే పనుల్లోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకోవచ్చని అన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు, వారిలో పరిశుభ్రతపై మంచి అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పాఠశాల ఆవరణతో పాటు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలని ఆయన సూచించారు. అధికార హోదాలో ఉండి ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని పరిశుభ్రతపై ప్రజలకు, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన అదనపు కలెక్టర్ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.






# ఉపాధ్యాయుడు ఆగస్టిన్ కు ఘన సన్మానం చేసిన గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న తప్పెట్లమోర్సు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు పి. ఆగస్టిన్ ని మంగళవారం నాడు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఘనంగాసన్మానించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఆగస్టిన్ విద్యా సేవలను అభినందిస్తూ మేడికొండ,చింతలకుంట,తప్పెట్లమోర్సు పాఠశాలల్లో ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు రూపొందించిన వినూత్న ఆవిష్కరణలు జాతీయ స్థాయిలో ప్రదర్శింపబడి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు విద్యార్థుల్లో సృజనాత్మకత శాస్త్రీయ ఆలోచనా విధానం, ఆవిష్కరణాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తూ,గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పిస్తున్న ఆగస్టిన్ గారి కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు విద్యార్థుల ప్రతిభకు, సహ ఉపాధ్యాయుల కృషికి జిల్లా విద్యా ప్రస్థానానికి లభించిన గౌరవం అని అన్నారు కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు ఉపాధ్యాయులు రాజనందం పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# హన్వాడ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## - రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

హన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, ల్యాబొరేటరీలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వస్తున్న ఔట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్యపై వైద్యాధికారిని వివరాలు అడిగి తెలుసుకుని, అనంతరం ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే అంశాన్ని కూడా ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని మందుల నిల్వలను పరిశీలించిన కలెక్టర్.. ముఖ్యంగా హైపర్‌టెన్షన్, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో






బాధపడుతున్న రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందుల నిల్వలు, వాటిలో ఏవైనా కొరత ఉందా అనే విషయంపై ఆరా తీయగా, ప్రస్తుతం ఆసుపత్రిలో మందులు సరిపడా ఉన్నాయని వైద్యాధికారి తెలిపారు.ల్యాబొరేటరీని కూడా పరిశీలించిన కలెక్టర్, అక్కడ నిర్వహిస్తున్న వివిధ రకాల వైద్య పరీక్షలు, రోజువారీగా నిర్వహిస్తున్న పరీక్షల సంఖ్య, పరీక్షలకు అవసరమైన సౌకర్యాల లభ్యతపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్యం, అవసరమైన మందులు, వైద్య పరీక్షలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవల విషయంలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ తనిఖీలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రగతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# డెంగ్యూపై అప్రమత్తం.. బాధితుల ఇళ్లకు డీఎంహెచ్ఓ

## - పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: డా. శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలో డెంగ్యూ వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పాత పాలమూరు పరిధిలోని కట్టెలమండి ప్రాంతంలో డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన బాధితుని ఇంటితో పాటు, శాశబ్‌గుట్ట ప్రాంతంలోని మరో డెంగ్యూ బాధితుని ఇంటిని సందర్శించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. బాధితులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడిన డీఎంహెచ్ఓ వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇరువురు బాధితులు ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణ చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాసులు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వ్యాప్తిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో, పరిసరాల్లో వారం రోజుల పాటు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని, దోమకాటు ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుందని వివరించారు. ఇళ్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు ఖాళీ చేయడంతో పాటు, ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం, పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రతి కుటుంబం బాధ్యతగా తీసుకున్నప్పుడే దోమల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రజలు జ్వరం తదితర అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డా. మమత, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, సుభాష్ చంద్ర, సిద్ధిక్, వెంకటేష్, రమణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

## - బీఆర్ఎస్ అహంకారపూరిత రాజకీయాలు మానుకోవాలి: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అహంకారపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మిథున్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వాన్ని విమర్శించేందుకు సరైన అంశాలు లేకపోవడంతోనే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో అనవసర వివాదాలకు దిగుతున్నారని ఆరోపించారు. స్పీకర్ పట్ల ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సభ్య సమాజం తలదించుకునే విషయమని అన్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకుని ఎమ్మెల్సీ తాతా మధుతో రాజీనామా చేయించడంతో పాటు, పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి ప్రజలను మభ్యపెట్టేలా పబ్లిక్ స్టంట్లు చేస్తున్నారని మిథున్‌రెడ్డి ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ మాట్లాడుతూ కేసీఆర్ డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో డ్రామా చేశారని ఆరోపించారు. స్పీకర్ పట్ల ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలతో కేసీఆర్‌కు సంబంధం లేకపోతే, వెంటనే ఆయనతో రాజీనామా చేయించి పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ మద్దతు ఇస్తున్నట్లుగా భావించాల్సి వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రకుమార్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి కంచిమి లక్ష్మణ్, నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- మండపాల వద్ద 24 గంటల భద్రత.. డీజేలకు నో..

రాత్రి 10 తర్వాత లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదు

- మండప నిర్వాహకులతో సమావేశంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మండప నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కవాతు మైదాన హాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ, మండప నిర్వాహకులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. మండపాల ఏర్పాటు, భద్రత, విద్యుత్ భద్రత, లౌడ్‌స్పీకర్ల వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఊరేగింపుపై పలు సూచనలు చేశారు.





### మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు

గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన వివరాలను పోలీస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. దీనివల్ల మండపాల వద్ద పెట్రోలింగ్‌తో పాటు నిమజ్జనం రోజున బందోబస్తు ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లు, ఫుట్‌పాత్‌లపై మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. మండపం, విగ్రహ భద్రత కోసం 24 గంటలూ కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా డ్యూటీలు ఏర్పాటు చేయాలని, వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి వాలంటీర్ ఫోటో ఐడీ కలిగి ఉండాలని తెలిపారు.మండపాలను నాణ్యమైన, భద్రమైన సామగ్రితో నిర్మించాలని, విద్యుత్ కనెక్షన్లకు నాణ్యమైన వైరును మాత్రమే ఉపయోగించాలని సూచించారు. మండపాల వద్ద టపాకాయలు, ఇతర మందుగుండు సామగ్రిని నిల్వ చేయరాదన్నారు. అత్యవసర దీపాలు, క్యూ బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, అగ్ని ప్రమాదాల నివారణకు నీటితో కూడిన డ్రమ్, రెండు బకెట్ల ఇసుక సిద్ధంగా ఉంచాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు.

### డీజేలకు నో.. రాత్రి 10 తర్వాత లౌడ్‌స్పీకర్లు బంద్:

స్థానిక డీఎస్పీ అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లను వినియోగించరాదని ఎస్పీ తెలిపారు. లౌడ్‌స్పీకర్లను భక్తి గీతాల కోసం మాత్రమే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను ఉపయోగించరాదని స్పష్టం చేశారు. మండపం ఆవరణలో గరిష్టంగా రెండు బాక్స్ టైప్ స్పీకర్లను మాత్రమే ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్లను వినియోగించరాదన్నారు. విద్యాలయాలు, ఆసుపత్రులు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా స్పీకర్లను ఏర్పాటు చేయరాదని సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగలు, హైటెన్షన్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్దేశించిన విద్యుత్ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

### నిమజ్జన ఊరేగింపులో నిబంధనలు పాటించాలి:

నిమజ్జనానికి అవసరమైన వాహనాలను నిర్వాహకులు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పోలీసుల సూచనల మేరకు వాహనాలను ముందుగానే బయలుదేరాలని, డీఎస్పీ కేటాయించిన ప్రత్యేక నంబరును వాహనంపై స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. ఒక్కో గణేష్ విగ్రహానికి ఒక వాహనానికి మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. విగ్రహాన్ని తరలించే వాహనంపై లౌడ్‌స్పీకర్ లేదా డీజే ఏర్పాటు చేయరాదన్నారు. మద్యం లేదా ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో ఉన్న వ్యక్తులను ఊరేగింపు వాహనాల్లోకి అనుమతించరాదని సూచించారు. సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలను మార్గమధ్యంలో లేదా ప్రార్థనా స్థలాల సమీపంలో నిలిపివేయరాదన్నారు. ఊరేగింపులో కర్రలు, కత్తులు, బాకులు, తుపాకులు, మండే పదార్థాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు, ఆయుధాలను తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు. జెండాలు, అలంకరణలకు ఉపయోగించే కర్రలు రెండు అడుగులకు మించరాదన్నారు.బాటసారులపై కుంకుమ, గులాబీ నీరు లేదా ఇతర పదార్థాలను విసరకూడదని, రాజకీయ లేదా రెచ్చగొట్టే ప్రసంగాలు, నినాదాలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఏ వర్గం మనోభావాలను దెబ్బతీసే చర్యలకు పాల్పడరాదన్నారు. ఊరేగింపులో బాణాసంచా కాల్చరాదని, పోలీసు అధికారులు ఇచ్చే సూచనలు, ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ కోరారు.

### సూచనా కరపత్రాల ఆవిష్కరణ:

గణేష్ ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన భద్రతా సూచనా కరపత్రాలను ఎస్పీ జానకి ప్రదర్శించి, నిర్వాహకులకు అందజేశారు. కరపత్రాల్లో పొందుపరిచిన నిబంధనలు, భద్రతా సూచనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని ఆమె సూచించారు.అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712659360, ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ 112కు సమాచారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, బాలాజీ, ట్రాన్స్కో ఏడీలు తౌర్య నాయక్, సంతోష్, మున్సిపల్ డీఈ, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మొతిరాం, మహబూబ్‌నగర్ టౌన్, జడ్చర్ల టౌన్ గణేష్ మండపాల నిర్వాహకులు, వీఎచ్‌పీ ప్రతినిధులు, కార్పొరేటర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీడీవోగా కే. సుదర్శన్‌కు పదోన్నతి

## జోగులాంబ గద్వాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిగా బాధ్యతలు

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో అసిస్టెంట్ షెడ్యూల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ గా సేవలందించిన కే. సుదర్శన్కు జోగులాంబ గద్వాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వసతి గృహ సంక్షేమ అధికారులు సుదర్శన్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సుదర్శన్ సేవలను అభినందిస్తూ, నూతన బాధ్యతల్లోనూ సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన సుదర్శన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు డి. సునీత, ఏఏఓ లక్ష్మీనారాయణ, టీఎన్‌జీఓ ట్రెజరర్, వసతి గృహ సంక్షేమ అధికారుల అధ్యక్షులు శ్రీ కృష్ణమోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ సత్యనారాయణ రెడ్డితో పాటు బాబురావు, విజయ్‌కుమార్, మోహన్, ప్రవీణ్‌రెడ్డి, మాధవి, మధులత, స్వప్నప్రియ తదితరులు పాల్గొన్నారు.





# పాలమూరు వర్సిటీకి మరో అరుదైన ఘనత

## - విద్యార్థుల స్థాయికి తగ్గట్టుగా కంటెంట్‌ను సిఫారసు చేసే వినూత్న పరికరానికి భారత ప్రభుత్వ పేటెంట్

## - పరిశోధన, ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం: ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణల రంగంలో పాలమూరు విశ్వవిద్యాలయం మరో ముందడుగు వేసింది. విద్యార్థుల విద్యా స్థాయి, అవగాహన సామర్థ్యం, అవసరాలకు అనుగుణంగా విద్యా సమాచారాన్ని సిఫారసు చేసే వినూత్న " ఎడ్యుకేషనల్ కంటెంట్ రికమండేషన్ డివైస్ "కు భారత ప్రభుత్వ పేటెంట్ లభించింది. పాలమూరు విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ జావేద్ మహమ్మద్ ఖాన్, డాక్టర్ ఎస్.ఎన్. అర్జున్ కుమార్, డాక్టర్ కె. నాగసుధ, డాక్టర్ ఎం. అరుంధతి రెడ్డితో పాటు ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న మరో ఐదుగురు ఫ్యాకల్టీ సభ్యులు కలిసి ఈ పరికరాన్ని రూపొందించారు. మంగళవారం పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో పేటెంట్‌కు సంబంధించిన అవార్డు/పేటెంట్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రమేష్ బాబుతో కలిసి ఆవిష్కరించారు.

**విద్యార్థి స్థాయికి తగ్గట్టుగా సమాచారం:**

ఈ పరికరం ప్రత్యేకత ఏమిటంటే.. ఒకే అంశంపై సమాచారం కోరినప్పటికీ, విద్యార్థి విద్యా స్థాయి ఆధారంగా తగిన కంటెంట్‌ను సిఫారసు చేయడం. ఉదాహరణకు 10వ తరగతి విద్యార్థి ఒక అంశంపై సమాచారం శోధిస్తే, అతని/ఆమె స్థాయికి అనుగుణంగా సులభంగా అర్థమయ్యే సమాచారాన్ని అందిస్తుంది. అదే అంశాన్ని ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థి శోధించినప్పుడు, వారి విద్యా స్థాయికి తగిన విధంగా మరింత విస్తృతమైన సమాచారాన్ని అందించేలా పరికరాన్ని రూపొందించారు. విద్యార్థుల విద్యా స్థాయి, అవగాహన సామర్థ్యం, అవసరాలకు అనుగుణంగా కంటెంట్‌ను సిఫారసు చేయడం ద్వారా విద్యా రంగంలో ఈ పరికరం ఉపయోగకరంగా ఉంటుందని ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగంతో అనుసంధానం చేస్తూ వినూత్న ఆవిష్కరణలకు పాలమూరు విశ్వవిద్యాలయం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.

**ఫ్యాకల్టీకి అభినందనలు:**



పేటెంట్ సాధనలో భాగస్వాములైన ఫ్యాకల్టీ సభ్యులను ఉపకులపతి, రిజిస్ట్రార్ అభినందించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు పరిశోధన, ఆవిష్కరణలపై మరింత దృష్టి సారించి సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రమేష్ బాబు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ జావేద్ మహమ్మద్ ఖాన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ఎన్. అర్జున్ కుమార్, బాలికల వసతి గృహ వార్డెన్ డాక్టర్ కె. నాగసుధ, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అరుంధతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీజేలు నిషేధం.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

## - చిన్నంబావి మండల ఎస్సై రామన్ గౌడ్ - మండపాల వద్ద 24 గంటల భద్రత..

## డీజేలకు నో.. రాత్రి 10 తర్వాత లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదు

**చిన్నంబావి,సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్సై రామన్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ. 17 గ్రామ పంచాయతీలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా మండప నిర్వాహకులకు సూచించారు. డీజేలు వినియోగంపై ఉన్న నిషేధాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చిన్నంబావి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.మండప నిర్వాహకులకు డీజే ఆపరేటర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించకుండా ఉండేందుకు అనుమతులు పొందాలని తెలిపారు. డీజేలు, డీజే బండ్లకు అనుమతి లేదని, మైక్‌లను నిర్ణీత శబ్ద పరిమితుల్లోనే వినియోగించాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అగ్నిప్రమాదాల నివారణ చర్యలు





చేపట్టడంతో పాటు విద్యుత్ శాఖ అనుమతులు పొందాలని సూచించారు. నిమజ్జనం రోజున నిర్దేశిత మార్గాల్లో ఊరేగింపు నిర్వహించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని మండప నిర్వాహకులకు ఎస్సై హెచ్చరించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వినియోగించే డీజే పరికరాలను సీజ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా డీజే నిర్వాహకులు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను అతిక్రమించి సమస్యలు సృష్టిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్సై రామన్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మహేష్ పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల మండప నిర్వహికులు హనుమంతరావు, చుక్కారావు, ఆకుల నారాయణ, నరేష్ యాదవ్, యువత తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు యూనివర్సిటీలో కీలక పదవులకు కొత్త నియామకాలు

## - పరిపాలనలో సమన్వయం, సామర్థ్యమే లక్ష్యం

## .. నూతన బాధ్యతలు చేపట్టిన అధికారులకు వీసీ సూచనలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
పాలమూరు యూనివర్సిటీలో పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించే దిశగా కీలక పదవులకు కొత్త నియామకాలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీ పరిపాలనా భవనంలో నూతనంగా నియమితులైన అధికారులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రమేష్ బాబు, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్ర కిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె. ప్రవీణ, చీఫ్ వార్డెన్ డాక్టర్ కృష్ణయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వర్ కుమార్ సమక్షంలో నియామక ఉత్తర్వులను అందజేశారు.



### కొత్తగా నియమితులైన అధికారులు:

పాలమూరు యూనివర్సిటీ పీఆర్వో గా డాక్టర్ ఎస్. రవికుమార్ను నియమించారు. అలాగే ఎగ్జామినేషన్ బ్రాంచ్ కోఆర్డినేటర్లుగా సుదర్శన్ రెడ్డి, డాక్టర్ శిలాస్, అకాడమిక్ ఆడిట్ సెల్ కోఆర్డినేటర్లుగా డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సుస్మిత, న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ వార్డెన్‌గా డాక్టర్ సురేష్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి:

ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ యూనివర్సిటీ ప్రతిష్ఠను మరింత పెంచేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అధికారిక విధుల్లో గోప్యత, నిబద్ధత, సమన్వయం, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. యూనివర్సిటీ పరిపాలనా వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నూతనంగా నియమితులైన అధికారులు యూనివర్సిటీ యాజమాన్యం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి యూనివర్సిటీ అభివృద్ధి, ప్రతిష్ఠను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# సభా గౌరవం మంటగలపొద్దు!

## - అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై కాంగ్రెస్ ధ్వజం

## - స్పీకర్‌పై వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలి

## - మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్

**వనపర్తి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**
శాసనసభ గౌరవం, నియమ నిబంధనలను ప్రతి ప్రజాప్రతినిధి కాపాడాల్సిన బాధ్యత ఉందని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీఆర్ వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే శాసనసభ నియమావళి, సభా సంప్రదాయాలను గౌరవిస్తూ నిరసన చేపట్టాలని అన్నారు. నల్లటి టీషర్టులతో నిరసన వ్యక్తం చేయడం, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సభా గౌరవానికి విరుద్ధమని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా భావించే శాసనసభలో ప్రజా సమస్యలు, విధానాలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని ఆయన అన్నారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత విమర్శల స్థాయికి తీసుకెళ్లకుండా సభా నియమాలను పాటించాలని సూచించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడతామని హెచ్చరించారు. ప్రజాబలం ఉంటే ప్రజల్లోకి రావాలి బీఆర్ఎస్ నేతలకు నిజంగా ప్రజాబలం ఉంటే అసెంబ్లీలో గందరగోళానికి బదులుగా ప్రజల్లోకి వచ్చి తమ విధానాలను వివరించాలని శ్రీనివాస్‌గౌడ్ సవాల్ చేశారు. రాజ్యాంగ పదవులు, ప్రజాస్వామ్య వ్యవస్థల గౌరవాన్ని కాపాడటం అన్ని రాజకీయ పార్టీల బాధ్యత అన్నారు. సభా గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యల విషయంలో క్షమాపణ చెప్పకపోతే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాజకీయ నేతలు తమ వైఖరిని మార్చుకుని రాజ్యాంగ విలువలను, సభా సంప్రదాయాలను గౌరవించాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, జనార్దన్‌సాగర్, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జానకిరాము, ద్యారాపోగు శ్రీను, పరుశురాం, క్రాంతికుమార్‌గౌడ్, పీతంబర్‌నాయక్, అత్తం రవి, వెంకటస్వామి, నరహరి, పాకనాటి కృష్ణ, ఎల్ఐసీ కృష్ణ, రమేష్, శ్రీనివాసు, ఎండీ బాబా తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులతో ఆశా వర్కర్ల ఉద్యమాన్ని ఆపలేరు

## - హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేస్తారా? - ఆశా వర్కర్లను వెంటనే విడుదల చేయాలి: సీఐటీయూ

**చిన్నంబావి, సెప్టెంబరు 8 (ప్రజాజ్యోతి)**

ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమిస్తుంటే పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం దారుణమని సీఐటీయూ సీనియర్ నాయకుడు ఆశన్న మండిపడ్డారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. చిన్నంబావి, వీవనగండ్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆశన్న.. అరెస్టయిన ఆశా కార్యకర్తలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని, అరెస్టయిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి**

ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆరు నెలల పీఆర్సీ బకాయిలతో పాటు ఎల్‌ప్రసీ సర్వే, పల్స్‌పోలియో, ఎన్నికల విధులు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అన్నారు. ఎన్‌సీడీ ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, స్ఫూటం (తెమడ) డబ్బాలు మోపించకూడదని, ఏఎన్‌సీ, పీఎన్‌సీ తదితర టార్గెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారాలు, పండుగలకు సెలవులు, ఏడాదికి 20 క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు కల్పించాలని కోరారు.

**అర్హతకు తగ్గట్టుగా పదోన్నతులు**

విద్యార్హతలు కలిగిన సీనియర్ ఆశా వర్కర్లకు ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పించాలని, ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆగస్టు 14న ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంలోని డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



**హామీలు అమలు చేయకుంటే పోరాటం ఉధృతం**

చిన్నంబావి మండలంలో 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్లే ఆశా కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి స్టేషన్లకు తరలించడం అన్యాయమని అన్నారు. అరెస్టయిన వారిలో లక్ష్మీదేవి, యశోదాభాయి, రామచంద్రమ్మ, పుష్ప, వేణమ్మ, లక్ష్మి, భాగ్యమ్మ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టయిన ఆశా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుంటే ఆశా కార్యకర్తలందరినీ ఐక్యం చేసి ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

## - వీర్లపల్లి శంకర్‌పై చిన్నంబావి పోలీసులకు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**చిన్నంబావి, సెప్టెంబరు 8 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ చిన్నంబావి మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చిన్నంబావి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన కేసీఆర్‌ను ఉద్దేశించి చావు కోరుతూ.. వెయ్యి డప్పుల ర్యాలీ నిర్వహిస్తామంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరమని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన తొలి ముఖ్యమంత్రిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించి ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను కనీసం ఆయన వయసు, హోదాను దృష్టిలో ఉంచుకుని గౌరవించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రాజకీయ విమర్శలు చేసుకోవచ్చు కానీ వ్యక్తిగతంగా అవమానించేలా, ప్రాణాలకు హాని కోరుకునేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై సమగ్రంగా విచారణ జరిపి, చట్టప్రకారం కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఇలాంటి వ్యాఖ్యలను ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాల ద్వారా తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేశిరెడ్డి  చిన్నారెడ్డి,వడ్డెమాన్ రామకృష్ణ, డేగ శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ రంజిత్‌కుమార్, ఉప సర్పంచ్ బిచ్చన్న,మాజీ ఉపసర్పంచ్ తగరం కురుమయ్య,ఆటో కురుమయ్య, తదితరులు ఉన్నారు.




# వైభవంగా సుంకులమ్మ బోనాల పండుగ



**చిన్నంబావి, సెప్టెంబర్ 08 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామంలో సుంకులమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని సుంకులమ్మ తల్లిని భక్తులు ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మొక్కులు చెల్లించిన భక్తులు బోనాల సందర్భంగా గ్రామ ప్రజలు కోళ్లు, పొట్టేళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుంకులమ్మ తల్లి కృపాకటాక్షాలు ఉండాలని భక్తులు కోరుకున్నారు.





# బీచ్ పల్లి బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 08:**

ఇటిక్యాల పోలీస్ స్టేషన్ వారు తెలిపిన వివరాల ప్రకారం కర్నూల్ వైపు నుండి హైదరాబాదుకు వెళ్ళు ఎన్ హెచ్ 44 హైవే రోడ్డు బీచ్ పల్లి బ్రిడ్జి పైన ప్రమాదము జరిగి గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినాడు.ఆ వ్యక్తి ఒక వయసు అందాజా 55-60 మధ్య ఉండవచ్చును.ఎవరైనా ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే ఇటిక్యాల పోలీస్ స్టేషన్లో సంప్రదించగలరు.ఈ నెంబర్లకు సంప్రదించగలరు. తెలిపారు.సెల్:8712670282 9346987198.